## క్లుప్తంగా...

### నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

సనత్‌నగర్: బేగంపేట షాపర్‌స్టాప్ బిల్డింగ్ సమీపంలోని వెంకటేశ్వరస్వామి సహిత వీరాంజనేయస్వామి దేవస్థానం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు చైర్మన్ అమరం శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తేదీ వరకు కొనసాగే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి శ్రీవిష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, 5న ఉదయం 9 గంటల నుంచి అగ్ని ప్రతిష్ఠ ధ్వజారోహణం, పూర్ణాహుతి తీర్థ ప్రసాద గోష్ఠి 6న చతుస్థానార్చన, మూలమంత్ర మాలామంత్ర గాయత్రీ మంత్ర హోమాలు, పూర్ణాహుతి, కల్యాణ మహోత్సవాలు, సాయంత్రం 6 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, 7న మహా పూర్ణాహుతి, చక్రస్నానం తదితర పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మెట్రో ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో శనివారం అమీర్‌పేట్ స్టేషన్‌లో ప్లాస్టిక్ వినియోగం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైల్ పర్యావరణ హితమైన ప్రయాణ సదుపాయాన్ని అందజేస్తుందన్నారు. 150 వాననీటి సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామని 28 మెట్రో స్టేషన్లలో ఏర్పాటు చేసిన సోలార్ పలకలతో 8.35 ఎండబ్ల్యూ విద్యుత్ లభిస్తుందన్నారు.

### నేడు మంత్రి పర్యటన

బన్సీలాల్‌పేట్: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ నెల 4 బన్సీలాల్‌పేట్‌లో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు బన్సీలాల్ పేట్, సీసీ నగర్ ప్రాంతాల్లో పర్యటిస్తారు. బన్సీలాల్‌పేట్ బార్ వద్ద బండమైసమ్మనగర్ బస్తీ రహదారిలో నూతనంగా నిర్మించిన అమ్మవారి స్వాగత ద్వారం, నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తారని అధికారులు పేర్కొన్నారు.

# రైతును రాజు చేయడమే సీఎం లక్ష్యం

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్: దేశానికే వెన్నెముక అయిన రైతును రాజు చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం రైతు దినోత్సవం సందర్భంగా బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో రైతులతో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న సంతోషంగా ఉండాలి..గౌరవించుకోవాలనే ఆలోచనతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు చేస్తుందన్నారు. 2014కు ముందు రైతులు అనేక సమస్యలతో సతమతం అయ్యేవారని, వంటలు సరిగ్గా పండక, గిట్టుబాటు ధరలు లభించేది కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలి..రైతులు సంతోషంగా ఉండాలనే ఆలోచనతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రధానంగా వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ సరఫరా, నూతన ప్రాజెక్టులను నిర్మించి సాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకున్నారన్నారు. పంట పెట్టుబడుల కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎకరానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఎకరాకు సాగు నీరు అందించాలనే లక్ష్యంలో దేశంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించడం జరిగిందని తెలిపారు. ఉచిత విద్యుత్ సరఫరా కోసం ప్రభుత్వం సంవత్సరానికి రూ. 12 వేల కోట్లు భరిస్తుందని, పంట పెట్టుబడి సాయం కోసం రూ. 15 వేల కోట్లు వెచ్చిస్తుందన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు రైతులను రాష్ట్రం ఆవిర్భావానికి ముందు, ఇప్పుడు ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యుత్, నీటి కొరత ఏం లేదని, చాలా సంతోషంగా ఉన్నామని ఈ సందర్భంగా పలువురు రైతులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ జేడీ ఇఫ్తెకార్, మార్కెట్ కమిటీ చైర్మన్ హారిక ఆనంద్ గౌడ్, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, కమీషన్ ఏజెంట్లు సంఘం అధ్యక్షులు సోమ దేవేందర్ రెడ్డి, మార్కెట్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు తలసాని శంకర్ యాదవ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ‘తెయూ’ రిజిస్ట్రార్ వివాదంపై జోక్యం చేసుకోండి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ యూనివర్సిటీ (తెయూ) రిజిస్ట్రార్ నియామకం కోసం గత కొన్ని రోజులుగా జరుగుతున్న వివాదంపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు శనివారం విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఉన్నత విద్యమండలి చైర్మన్ ప్రొ.లింబాద్రికి వేర్వేరుగా వినతి పత్రం ఇచ్చారు. రిజిస్ట్రార్ నియామకంపై వీసీ, ఈసీ నడుమ కొనసాగుతున్న వివాదంతో యూనివర్సిటీ పాలన స్తంభించిందన్నారు. సమస్యలు పరిష్కరించి అకాడమిక్ వాతావరణాన్ని నెలకొల్పుతామని మంత్రి హామీ ఇచ్చినట్లు పీడీఎస్‌యూ నాయకులు నాగేశ్వర్‌రావు, రామకృష్ణ, ఆజాద్ పేర్కొన్నారు.

## ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

సనత్‌నగర్: బేగంపేట బ్రాహ్మణవాడిలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ కమిటీ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. చిన్నారుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిత్రలేఖనం, సంగీతం, యోగా, నృత్యంలో శిక్షణ పొందిన చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సురభి సోలార్ డైరెక్టర్ శేఖర్ మారంరాజు మాట్లాడుతూ.. వేసవి శిక్షణ శిబిరం ద్వారా నేర్చుకున్న అంశాలు భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా రాణించేందుకు దోహదపడతాయన్నారు. చిన్నారులు ఒక నిర్దిష్ట లక్ష్యం పెట్టుకుని దాన్ని సాధించేవరకు పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో స్వామి రామానందతీర్థ స్కూల్ ప్రిన్సిపాల్ వాసుకి దేవి, రామానందతీర్థ మెమోరియల్ కమిటీ ఇన్‌చార్జి అరుణశ్రీ పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా దశాబ్ది ఉత్సవాలు



అధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు

చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో కలిసి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 5న సీతాఫల్‌మండిలో విద్యుత్ విజయోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడు వారాల పాటు పండుగ వాతావరణంలో జరిగే వేడుకల్లో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నర్సింహ, డిప్యూటీ కమిషనర్ దశరథ్, విద్యుత్ డివిజన్ ఇంజనీర్ శ్రీధర్, డిప్యూటీ ఇంజనీర్ మహేష్, పాల్గొన్నారు.

# ఆరోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులు

**జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి**



మొక్క నాటుతున్న డాక్టర్ వెంకటి

సనత్‌నగర్: మంత్రి హరీష్‌రావు సారథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి పేర్కొన్నారు. మంత్రి హరీష్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం డాక్టర్ వెంకటి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిన అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 69 శాతం పెరిగాయని, వ్యాధి నిరోధక టీకాలు వంద శాతం అందించేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. బస్తీవాసుల చెంతకే వైద్యం అందించాలనే ఉద్దేశంతో దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు.

## సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతా



స్థానికులతో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

రసూల్‌పురా: సెంట్రల్ బత్రిబస్తీలో స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి త్వరలో నూతన పైపులైను పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు మర్రి రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం బోర్డు ఏడో వార్డు తిరుమలగిరి సెంట్రల్ బత్రిలో ఆయన శ్యామ్‌కుమార్‌తో కలిసి పర్యటిస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆర్మీ అధికారులు డ్రైనేజీ వెళ్లకుండా అడ్డుగా గోడను కట్టారని డ్రైనేజీ సమస్య నూతనంగా పైపులైను వేయాలని ఈ సందర్భంగా స్థానికులు కోరారు. బోర్డు నిధులు విడుదలైనా పనులు జరగడం లేదని బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు చొరవ చూపుతానని మర్రి రాజశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి మధుకర్, రాజుసింగ్, యశ్వంత్‌కుమార్, శకుంతల, చిన్నా పాల్గొన్నారు.

## సింహవాహిని ఆలయాభివృద్ధికి చర్యలు

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



మంత్రిని కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

సనత్‌నగర్: ఎంతో చరిత్ర కలిగిన లాల్‌దర్వాజ సింహవాహిని ఆలయ అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సింహవాహిని ఆలయ నూతన కమిటీ సభ్యులు మంత్రిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల కోసం ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రూ.10 కోట్లను మంజూరు చేశారని చెప్పారు. ఆలయ అభివృద్ధి కోసం పరిసరాల్లోని స్థల సేకరణ ప్రక్రియ జరుగుతుందని, అది పూర్తికాగానే పనులను చేపట్టనున్నట్లు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో చైర్మన్ రాజేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మారుతిరావు, కోశాధికారి సురేందర్‌ముదిరాజ్, అరవింద్‌కుమార్‌గౌడ్ ఉన్నారు.

## ఓపెన్ నాలాల సమస్యలకు పరిష్కారం

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లోని అన్ని ఓపెన్ నాలాలకు పైకప్పులు ఏర్పాటు చేస్తామని బోర్డు సభ్యుడు రామకృష్ణ తెలిపారు. శనివారం బోయిన్‌పల్లి నేతాజీ నగర్‌లో ఓపెన్ నాలాపై స్లాబు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. గతంలో బస్తీబాటలో భాగంగా పర్యటించినప్పుడు స్థానికులు ఓపెన్ స్లాబ్ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో స్లాబు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దశల వారీగా కంటోన్మెంట్‌లో అన్ని ఓపెన్ స్లాబులకు పైకప్పులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పరశురామ్, శ్రీరాములు, కృష్ణ మోహన్, వెంకటచారి, సత్యం, బలరామ్, దమయంతి, విశ్వజిత్, అజయ్, అభిషేక్, దీపక్, శ్రీనివాస్, కేశవ రావు, బాబు పాల్గొన్నారు.

## సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఒమర్ ఖాన్



లాలాపేట: సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన ఎండీ ఒమర్ ఖాన్ నియమిస్తూ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో పాటు సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఒమర్ ఖాన్ మాట్లాడుతూ.. కార్మికవర్గ సమస్యల కోసం, అణగారిన వర్గాల ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. ప్రజా సంఘాలతో కలిసి పని చేస్తూ పార్టీ బలోపేతానికి పాటు పడతానని పేర్కొన్నారు.

## ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బైబిల్‌హౌస్ సమీపంలోని మహంకాళి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో పలువురు ఎస్.ఐలు బాధ్యతలు స్వీకరించారు. వివిధ పోలీసు స్టేషన్‌లో పనిచేసిన వీరు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఎస్.ఐలు హరీష్, దేవ సురేష్, శశిధర్ ఇన్‌స్పెక్టర్ నరసింహను కలిసి బాధ్యతలు స్వీకరించారు. ముగ్గురి బాధ్యతల స్వీకరణతో మహంకాళి స్టేషన్‌లో ఎస్.ఐల సంఖ్య ఐదుకు పెరిగింది. ఈ సందర్భంగా సురేష్, హరీష్, శశిధర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నిర్మాణాత్మకంగా ముందుకు సాగుతామని రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు.

## చికిత్స పొందుతున్న వృద్ధురాలి మృతి

చిలకలగూడ: చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన గాంధీ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. చిలకలగూడ సీఐ మట్టంరాజు వివరాల ప్రకారం.. గత నెల 28న అవుట్ పేషెంట్ విభాగం వద్ద ఓ వృద్ధురాలు అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు వృద్ధురాలిని అత్యవసర విభాగంలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈనెల 2వ తేదీ రాత్రి మృతి చెందింది.బంధువులు, తెలిసిన వారుంటే చిలకలగూడ పోలీసులు, లేదా 040–27853597 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

పర్మినెంట్ చేయాలంటూ ..


## మండుటెండలో మానవహారం



ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు మానవహారం చేపట్టారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఓయూ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ పరశురామ్ ఆధ్వర్యంలో వివిధ వర్సిటీలకు చెందిన అధ్యాపకులు మండుటెండలో మానవహారంతో నిరసన తెలిపారు. అన్ని ప్రభుత్వ కాలేజీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను పర్మినెంట్ చేసి కేవలం యూనివర్సిటీలలో పని చేసే వారిని నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. అన్ని అర్హతలు ఉండి తక్కువ వేతనంతో ఏళ్ల తరబడిగా పర్మినెంట్ ప్రొఫెసర్లతో పాటు సమానంగా పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను సీఎం కేసీఆర్ పట్టించుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో కాంట్రాక్టు అధ్యాపకులు కీలక పాత్ర పోషించారని, ఆ సమయంలో సీఎం కేసీఆర్ కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ధర్మతేజా, డా.వేల్పుల కుమార్, డా.ఉపేందర్‌రావు, డా.ప్రేమయ్య, డా.ఉపేందర్, డా.ప్రియకుమారి, డా.శ్రవంతిరెడ్డి పాల్గొన్నారు.



## పోడు భూముల పట్టాలను నిలిపివేయండి



మాట్లాడుతున్న గద్దం శ్రీరామ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం భద్రాదికొత్తగూడెం జిల్లాలో జూన్, జూలైలో అందచేయనున్న పోడు భూముల పట్టాలను నిలిపివేయాలని ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు గద్దం శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల భద్రాదికొత్తగూడెం జిల్లాలో పర్యటించామని, పోడు పట్టాలకు గిరిజనేతలు నకిలీ ఎస్టీకుల ధృవీకరణ పత్రాలు అక్రమంగా పొందినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గిరిజనేతరులు, ఇతరులు (అధికారులు, నేతలు) కుమ్మక్కై పైరవీలు, పైసా, పలుకుబడితో కేవలం పోడు పట్టాల కోసం ఎస్టీ సర్టిఫికెట్లు పొందుతున్నారని ఆరోపించారు. నకిలీ ఎస్టీ సర్టిఫికెట్లకు పోడుపట్టాలు ఇస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రేమ్‌నాయక్, తిరుపతినాయక్, అరవింద్, మహేష్, సుభాష్ పాల్గొన్నారు.